# విలువలు




—వి. వి. రమణమూర్తి

తలుపు తట్టాను. కొన్ని క్షణాల తరవాత తెరుచుకుంది.

"బి. డి. ఓ. సుబ్బారావుగారి ఇల్లు ఇదేనాండి?"

"ఇదే. ఆ వాటాలో ఉన్నారు. లోపలకు రండి." అని ఎవరో సమాధానం చెప్పి కేకవేసింది.

"కళ్యాణొదినోయ్, మీ ఇంటి కెవరో వచ్చారు."

సావిట్లో కుర్చీలో కూలబడ్డాను.

"ఏంరా, ప్రసాదం, ఎన్నాళ్లకెన్నాళ్లకి! ఇదేనా రావడం? ఇప్పటికి జ్ఞాపకమొచ్చిందన్న మాట అక్కయ్య? వస్తున్నట్టు ఒక ఉత్తరం ముక్కయినా రాయకూడదురా? స్టేషనుకు జీపు పంపేదానినిగా?"

అదేమిట్రా అలా నీరసంగా ఉన్నావ్? కళ్లు లోతుకు పోయాయేం? అదంతా చదువే! ఇంతకీ పరీక్షలు బాగా రాశావా?

ఒరే, బాబీ, మామయ్యొచ్చాడురా, మామయ్య. ఏదీ అను. మా...మ...య్య. వెళ్లు, నాన్నా, భయం లేదు. మన మామయ్యేగా!

ఒసే, సుబ్బీ, అలా చూస్తావేమిటే? తమ్ముడే. నా తమ్ముడు. ఎమ్. ఎ. చదివాడు. రేపో మాపో పెద్ద ఆఫీసరవుతాడు. ఎందలకు వందలు జీతం వస్తుంది- తెలుసా?

ముందా మేడమీద గది శుభ్రంగా తుడువ్. పరుపుమీద మాసిన దుప్పటి తీసి కొత్తది వెయ్యి. ఆ హోల్డాలు, సూట్‌కేసు మేడమీద పెట్టు. తరవాత స్నానానికి నూతి దగ్గర వేణ్ణీళ్లు పెట్టు. బాగా వేడిగా ఉంటేగాని పోసుకోడు.

అయ్యో, నా తెలివి మండా! ముందు కాఫీ తెస్తా నుండరా."

సమాధానాలకు వ్యవధి ఇవ్వకుండా కళ్యాణక్కయ్య చకచకమని స్వాగతం, కుశలప్రశ్నలు, పరిచయాలు, నిష్ఠూరాలు తన సహజధోరణిలో ముగించి, పనిమనిషికి పనులు పురమాయించింది.

మాటలకు అక్కయ్య చిన్నసైజు టోర్నేడో అని నాన్నగారనేవారు. నోరు విప్పిందా ఆ ప్రవాహానికి హద్దూ పద్దూ ఉండదు.

అక్కయ్య పెళ్లి తరవాత కూడా వీసమంతయినా మారినట్లు లేదు.

మధ్యాహ్నం భోజనాలయ్యాయి. బావగారు ఆఫీసు కెళ్లారు. నేను మేడమీది కెక్కాను. మహిళామండలి సభ్యులంతా సావిట్లో సమావేశమయ్యారు. సగర్వంగా చెప్పుకుపోతూంది అక్కయ్య.

"తమ్ముడు వరప్రసాదం. నా కన్న మూడేళ్లు చిన్న. బోల్డు దూరంలో చదువుతున్నాడు. ఉదయం పదకొండు గంటలకు వచ్చాడు. నా పెళ్లయిన తరవాత ఇదే మా ఇంటికి వాడు రావడం.

ఏం చదివాడా?. . . ఎమ్. ఎ.

ఉద్యోగమా?. . . ఏదీ. మొన్ననే పరీక్షలు రాశాడు. ఇంక చేస్తాడు. పెద్ద ఆఫీసరవుతాడు.

పెళ్లా?. . . ఇంకా కాలేదు. చదువయిందిగా. ఇంక చేసుకుంటాడేమో. మేనరికాలు లేవులెండి. అయినా అప్పుడే వాడి పెళ్లికి తొందరేమిటి, పిన్నిగారూ!"

జంకు, కుతూహలం మేళవించిన సన్నసన్నని ప్రశ్నలు.

గర్వం, దర్పం, తృప్తితో కూడిన అక్కయ్య జవాబులు. కుతూహలంగా విన్నాను. ఇంకా విందామని ప్రయత్నించాను. కాని, కళ్లు బలవంతంగా మూతలు పడుతూంటే ఎప్పుడో నిద్ర పట్టింది.

"ప్రసాదం! ఒరేయ్ ప్రసాదం. లేరా. అయిదున్నరయింది. ఇంకా ఎంతసేపని పడుకుంటావ్? మొద్దు నిద్రానువ్వూనూ. బావ ఎక్కడికో వెళతారట. వస్తావేమో అడగమన్నారు."

తెలివి వచ్చింది. బద్ధకంగా ఒళ్లు విరుచుకొని అక్కయ్య చేతిలోని కాఫీ గ్లాసును తీసుకున్నాను.

"ఏం బాబూ, అంత నిద్ర! స్లీపరులో బెర్తు దొరకలేదా?"

"దొరికింది కాని నిద్ర పోవడానికి టైమే దొరకలేదు. నీకు తెలుసుగా?"

"అదీ సంగతి. పురాణం వేశావన్న మాట. సరేగాని, బావ ఏదో గ్రామానికి వెళతారట. రాత్రికి తిరిగి వచ్చేస్తారులే. వెళ్లదలుచుకుంటే త్వరగా తెములు."

"చంపావు ఫో. మనకు, గ్రామోద్ధరణకు మధ్య యోజనాల దూరం. ఈ మహానగరంలో క్లబ్బేదయినా ఉందా? పోయి రమ్మీ ఆడుకుంటాను." అతి రహస్యంగా అక్కయ్యకు విన్నవించుకున్నాను.

"నువ్వు ఇంత పిసరుకూడా మారలేదురా. 'టౌన్ క్లబ్బుందిలే.' ఎక్కడికో అక్కడికి. త్వరగా తెములు."

అక్కయ్య అనుమతిస్తే బావను మధ్యపెట్టడం సులభం. గండం గడిచినందుకు సంతోషించి మొహం కడుక్కొని సిద్ధమయ్యాను.

నా వకాల్తా అక్కయ్యే పుచ్చుకొంది.

"ఏమండీ, వాడు క్లబ్బుకు వెళతాడట. వాడిని క్లబ్బులో దించి మీరు వెళ్లండి. డ్రైవర్, రెడీయేనా?"

"రెడీయే నమ్మగారూ." వీధిలోనుండి వచ్చింది సమాధానం.

వీధి గుమ్మం మెట్లు దిగాను. గ్రామోద్ధరణకు ప్రభుత్వంవారు ప్రసాదించిన బ్లాకు జీపు సిద్ధంగా ఉంది. జీపులో బీడీ కాలుస్తూ కూర్చున్నాడు డ్రైవరు. నన్ను చూస్తూనే బీడీ పారవేశాడు.

**అంతస్తుని బట్టి విలువలు మారుతుంటాయి. విలువలను దృష్టిలో పెట్టుకొనే అంతస్తులను పెంచుకొంటుంటారు. రెండిటి మధ్య నిజం ఒప్పుకోలేక, అబద్ధం ఆడలేక, మౌనం వహించడం మనిషిలోని బలహీనతకు నిదర్శనంగాని సంస్కారానికి చిహ్నం కానేరదు. అంతస్తు, విలువల మధ్య తనకు తానుగా నిలబడి ఔననిపించుకోగలిగిన సామాన్యుడు అసామాన్యుడే.**

అక్కడక్కడ చిరుగులతో, బాగా మాసిన ఖాకీదుస్తులు, అరిగి అరిగి కొన ఊపిరితోనున్న హవాయి చెప్పులు బీదరికాన్ని స్పష్టంగా చాటుతున్నాయి. అయితేనేం? మీసం దువ్వుకొంటూ, గెడ్డాన్ని సవరించుకొంటూ స్టీరింగు ముందు నవాబుదర్జాలో కూచున్నాడు డ్రైవరు.

నన్ను క్లబ్బులో దింపి, మిగిలిన సభ్యులకు పరిచయం చేసి బావ తన పనిపై వెళ్లిపోయారు.

కొత్త స్థలంలో, కొత్త మొహాల మధ్య రమ్మీ ఆటకు దిగాను. కొంటు రూపాయి.

ఆ చిన్న పట్టణానికి సంబంధించిన నా కర్థంకాని రాజకీయాలు, మధ్య మధ్య ఎవడో హుసేనుపై విసుర్లు, ఛలోక్తులు, వేళాకోళాలు, నవ్వులమధ్య తేలిక అయిన వాతావరణంలో మూడు గంటల సేపు ఆట హుషారుగా సాగింది.

సంభాషణల మధ్య దొర్లిన హుసేను నా జీవితంలో ప్రగాఢముద్ర వేసుకుంటాడని, అతని ఛాయ నన్ను జీవితాంతం వెంటాడుతూనే ఉంటుందని నాకు అప్పట్లో తెలియదు.

ఆప్యాయత, అభిమానం ఉట్టిపడే అక్కయ్య ఆదరణ, బాబిగాడి అల్లరి, బావ స్నేహశీలం, మధ్యాహ్నపు మహిళా మండలి సమావేశాల చర్చలు, సాయంకాలం క్లబ్బులో కొంటురూపాయి రమ్మీ— ఈ వాతావరణంలో ఏడు రోజులు ఏడు క్షణాల్లా గడిచిపోయాయి.

తేలికపడిన మనస్సుతో హైదరాబాదుకు ప్రయాణమయ్యాను.

* * *

బరువు, బాధ్యతలు లేని గాలిపటం వంటి విద్యార్థిదశ నా ఎమ్. ఎస్‌సి. పరీక్షాఫలితాలతో పూర్తయింది. విశ్వవిద్యాలయంవారు ఇచ్చిన పట్టా చేతపుచ్చుకొని బ్రతుకుతెరువును అన్వేషిస్తూ నేను చేసిన దేశాటనంలో నేర్చుకున్నది, పదిహేనేళ్ల విద్యార్థి జీవితంలో నేర్చుకున్న దానికంటె ఎన్నోరెట్లు ఎక్కువ. జీవితపు లోతుపాతులు, సామాన్యుని కెదురయ్యే ఢక్కామొక్కీలు ఒక్కొక్కటే అవగాహన కాజొచ్చాయి. నిరుద్యోగిని కాకుల్లా పొడిచే బంధువులు, నిరుద్యోగి అయితేనేం అల్లుడుగా పనికివస్తాడని అంచనాలు వేసే ఆడపిల్లల తండ్రులు, సానుభూతిని ఒలకబోసే స్నేహితులు— వీరందరికి అందని సుదూరసీమలకు పారిపోవాలనిపించేది. మూడేళ్ల అన్వేషణ తరవాత చావుబతుకుల సరిహద్దులలో ఏదో ఒక ఉద్యోగం దొరికింది. పేదవాడికి పెన్నిధి.

రెండేళ్ల ఉద్యోగంలో సెలవు దొరకలేదు.

ఏతావాతా అయిదేళ్ల తరవాత నేను తిరిగి ఆ ఊరిలో అడుగు పెట్టడం తటస్థించింది. అక్కయ్య నిష్ఠూరాలకు ఆస్కారమివ్వకుండా, వస్తున్నట్లు ముందుగానే ఉత్తరం వ్రాశాను.

ట్రెయిను దిగి సూట్‌కేసు పట్టుకొని స్టేషనులోనుండి బయటకు వచ్చేసరికి డ్రైవరు జీపుతో సిద్ధంగా ఉన్నాడు.

కాలుస్తున్న బీడీని పారవేశాడు.

"నమస్కారం, సార్."

"నమస్కారం. బాగున్నావా?"

తల ఊపాడు. నా చేతిలోని సూట్‌కేసును తీసుకొన్నాడు.

"హుసేను సాయిబుగారూ, నమస్కారం. బాగున్నారా?"

"నమస్కారం. ఏదో ఇలాగున్నాను."


"సలామాలేకుం, హుసేన్‌మియా."

"ఆలేకుం సలామ్."

స్టేషనులోని వారందరు పనిగట్టుకొని వచ్చి పలకరించినట్లు కుశలప్రశ్నలకు దిగారు. చివరకు జీపు కదిలింది.

పరిశీలనగా చూశాను. ఇస్త్రీ మడతలు నలగని ఖాకీదుస్తులు. కొత్త హవాయిచెప్పులు. మనిషి శుభ్రంగా ఉన్నాడు. జీవితంలో గడిచిన అయిదేళ్ల ప్రభావం తప్ప మనిషిలో ప్రత్యేకమైన మార్పేమీ లేదనిపించింది నాకు.

అప్పటి నా అంచనా తప్పని తెలియడానికి ఇరవైనాలుగు గంటలయినా పట్టలేదు.




ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి సంభాషణకు దిగాను.

"నీ పేరేమిటోయ్?"

"హుసేన్."

"నీ కెం తిస్తారు?"

"ఏదో ఇస్తారు."

తిరుగుడు చాలా ఉందే అనుకున్నాను. ఇష్టంలేనివాడితో సంభాషణ పెంచడం కష్టం.

అతని దృష్టంతా రోడ్డుపైనే ఉంది. రోడ్డుకడ్డంగా రెండావులు పడుకున్నాయి. వాటిని తప్పిద్దామనుకున్నాడు. అంతలో రెండూ ఒకేసారి గాభరాగా లేచాయి.

కళ్లు మూసుకున్నాను. ప్రమాదం.

కళ్లు తెరిచి చూసేసరికి జీపు మామూలుగా పోతూంది. వెనకకు తిరిగి చూశాను. ఆవులు మళ్లా రోడ్డు కడ్డంగా పడుకున్నాయి.

"భయపడ్డారా?" నవ్వుతూ ప్రశ్న.

నాకు ఒళ్లు మండింది. నేను భయపడ్డ మాట నిజం. ఆ నిజం మరొకరి నోట వినడం నేను సహించలేను. పిరికితనాన్ని ఒప్పుకోవడం నాగరికతకు లక్షణం కాదు కాబట్టి, నిజాన్ని ఒప్పుకోలేక, అబద్ధం చెప్పలేక మౌనం వహించాను.

కళ్యాణక్కయ్య చిరునవ్వుతో పలకరించింది.

"అయిదేళ్లకు గుర్తు కొచ్చిందన్న మాట అక్కయ్య. బాగున్నావా?"

"నా కేం? ఫస్టుక్లాసుగా ఉన్నాను. బావేరి?"

"ఆఫీసు కెళ్ళారు."

"ఆదివారం నాడుకూడా?"

"ఆఁ ఏదో పనుందిట."

"మన రాక్షసు లేరీ?"

నిండుగా నవ్వింది.

"బాబిగాడు ఎక్కడో ఆడుకుందుకు పోయుంటాడు. చంటాడు పడుకున్నాడు. కాఫీ తెస్తానుండు."

"సుబ్బీ,సూట్ కేసు ఆగదిలో పెట్టవే."

ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు వెనకకు తిరిగి అంది:

"హుసేనుగారూ, లోపలకు వచ్చి కూర్చోండి. కాఫీ తాగి వెళుదురుగాని."

ఆశ్చర్యపడ్డాను. డ్రైవరును సగౌరవంగా పేరు పెట్టి పిలవడం, కాఫీ ఇవ్వడం— ఈ మర్యాదలు అయిదేళ్ల క్రితం నేను చూడలేదు. నాకు తెలిసినంత వరకు, తన పైవారికేగాని కిందివారికి గౌరవమివ్వనక్కర లేదనుకొనే తరహా వ్యక్తి కళ్యాణక్కయ్య. అక్కయ్య మారిందన్న మాట.

మధ్యాహ్నం భోజనాలయాయి. కింది గదులలో ఒకటి నాకై ప్రత్యేకించ బడింది. ఒకటో క్లాసు చదువుతున్న బాబిగాడు తన తెలివితేటలన్నీ వా ముందు ప్రదర్శిస్తున్నాడు. చంటాడు నేను తెచ్చిన బొమ్మలతో ఆడుకొంటున్నాడు.

ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ వాతావరణం రానున్న తుఫానుకు నాంది అని, వచ్చే ఏడు గంటలు నా జీవితంలో నికృష్టపు దుష్టఘడియలని నాకు అప్పట్లో తెలియదు. ఆ రోజు నా జీవితంలో ఒక దుర్దినం.

బావ ఆఫీసు కెళ్లారు.

మహిళామండలి సావిట్లో సమావేశమయింది.

కాస్తసేపు మండిపోతున్న ధరలు, తెలివి మీరిపోతున్న లోకం, పరిమిత కుటుంబాల గురించి ఇష్టాగోష్ఠి జరిగింది.

రెండు రెళ్ళు నాలుగు,రెండు మూళ్లు ఆరు. . . బాబిగాడు ఏకబిగిని దంచేస్తున్నాడు.

చంటాడి మోటారుసైకిలు రౌండ్లు తిరుగుతూంది.

మహిళామండలి సభ్యులు ప్రపంచ దిగ్విజయ యాత్రను ముగించి నాపై దండెత్తారు.

"తమ్ము డేం తెచ్చాడు?"

తృప్తిగా నవ్వుకున్నాను.

ఎగ్జిబిట్ నంబర్ వన్ జూరీ సభ్యుల ముం దుంచబడింది.

ఎక్స్ రే చేయబడింది.

"ధరెంత?"

"నలభై రూపాయిలు." అక్కయ్య సమాధానం.

గాలివాన ప్రారంభమయింది. కుంచించుకుపోయాను.

చంటాడి మోటారుసైకిలు గోడకు గుద్దుకొంది.

"దీనికి నలభై రూపాయిలా!" ఏకగ్రీవమైన ఆశ్చర్యం.

సమాధానం లేదు.

అది, మోజు పడి నేను అక్కయ్యకు కొన్న పాతిక రూపాయిల సంబల్‌పూరు చీర.

టాపిక్ చీరనుండి ముద్దాయి పైకి మళ్లింది.

"తమ్ముడి కెక్కడటా పని?"

"భువనేశ్వర్లో."

"ఏం పనిటా?"

"ఏదో గుమాస్తా."

నా ఒంటిమీద తేళ్ళు.

మానవరక్తాన్ని ఒకసారి రుచి చూసిన పులి, తిరిగి మానవరక్తాన్నే వెతుకుతుంది. మనం తిరిగే సంఘంలో మనుష్యులు కూడా అంతే. ఎదుటివాడి బలహీనతలను ఆటవస్తువులుగా తీసుకొంటారు.

"గుమాస్తా పనికి అంత దూరమెందుకూ?"

సమాధానం లేదు.

"ఏమిస్తారుటా?"

"ఏదో ఇస్తారు."

గుచ్చి గుచ్చి ప్రశ్నలు. ప్రశ్నల వర్షం కురుస్తూంది. నిస్పృహ ఆవహించినట్లు నిర్లిప్తంగా అక్కయ్య సమాధానాలు చెపుతూంది.

బలిపీఠం ముందు వధ్యపశువు. ఎవరు?

నేనా? అక్కయ్యా?

గది తలుపు తీసుకొని సావిట్లోకి వెళ్లి నా మనస్సులోని కసినంతటిని వాళ్ల మీద గుమ్మరించా లనిపించింది.

"ఓ కమలమ్మగారూ, సుబ్బమ్మగారూ వగైరా వగైరా అందరూ! మీ కేం పనీపాటూ లేదా? మొగుళ్ళు తెచ్చి పడేస్తుంటే తీరికగా కూచొని ఊళ్ళో వాళ్లందరి సంగతులు వాకబు చేయడమేనా? నీ మొగుడు మాత్రం కలెక్టరా?' . . ."

ఇవన్నీ నేను అందామనుకొన్న మాటలు.

పెరటి తలుపు తెరుచుకొని దొడ్డిదారంబట ఊరు విడిచి పారిపోదామనిపించింది. పారిపోలేకపోయాను.

నేను చేయగలిగిందల్లా బలవంతంగా చెవులు మూసుకోవడం. మాటలు సమ్మెటపోటులవలె తగులుతున్నాయి.

* * *

సాయంకాలం బావతో కలిసి క్లబ్బుకు వెళ్లాను. ఆట సాగుతూంది—రమ్మీ ఇంటర్నేషనల్.

పరస్పర పరిచయా లయాయి.

"మాస్టారూ, ఒక చెయ్యి కలుపుతారా? పాతిక, ఏభై."

"మై గాడ్! అంత స్టేక్సు వద్దండి. సరదాగా కాలక్షేపానికి ఆడే ఆట గాంబ్లింగుగా మారుతుంది." అభ్యంతరం చెప్పాను.

"గాంబ్లిం గేమిటండీ? ఇన్సల్ట్. హైకోర్టు తీర్పు చెప్పిందిగా — రమ్మీ ఈజ్ ఎ గేమ్ ఆఫ్ స్కిల్!" అన్నా డొక కుర్ర లాయరు.

"ఇదే చిక్కు. పేకాటనేసరికి గాంబ్లింగనుకుంటారు. మన దొక జాతి. ఆ జాతికి ఒక పతాకం, విహంగం, మృగం జాతీయ స్థాయిలో ఉన్నాయి. అలాగే ఒక జాతీయపు ఆటకూడా కావాలి. కన్యాకుమారి నుండి కాశ్మీరువరకు చూశాను. ఈ ఆటను దేశవ్యాప్తంగా ఆడుతున్నారు. న న్నడిగితే రమ్మీని నేషనల్ గేమ్‌గా డిక్లేర్ చెయ్యాలి." జాతీయస్థాయికి ఎదిగి ఆలోచించగలిగిన ఆ వ్యక్తి ఒక కాంగ్రెసు మెంబరు.

"స్టేక్సు తగ్గించండి. మాక్సిమమ్ ఫైవ్." కూరగాయల బేరానికి దిగాను.

"ధరలు మండిపోతున్నాయి. అన్నీ తారాపథంలో ఉన్నాయి. వాటిని ఎలాగూ దించలేము కాబట్టి, మనిషికూడా పోటీగా చంద్రమండలంపైకి వెళ్ళాడు. ఇంకా కౌంటు అయిదు రూపాయి లేమిటండీ? లా ఆఫ్ ఆవరేజస్ చూశారూ— ఈవేళ ఏభై వస్తుంది. రేపు పోతుంది. అంతే. ఇది గాంబ్లింగంటే నేను ఒప్పుకోను. మన జీవితమే ఒక పెద్ద గాంబిల్. ఏమంటారు? పేలవమైన లైఫ్‌లో కొంచెం గాంబిల్ లేకపోతే థ్రిల్ ఉండదండీ."

ఆయన హైస్కూలు హెడ్మాస్టరు.

"ఇంతకూ చెయ్యి కలుపుతారా, మాస్టారూ?"

ఆ ప్రశ్న అడిగిన తీరులోనే— 'నీ మొహం, నువ్వు ఆడే దేమి' టన్నట్లు అర్థం స్ఫురించింది నాకు.

అంత స్టేక్సుతో ఆడగలిగిన స్తోమతు నాకు లేదు. మరొకసారి మరొక వర్గంయందు కూడా నేను పురుగులా చూడబడ్డాను. చదువు సంస్కారాలు, వనిపాటులు లేని వర్గమొకటి; ఇవన్నీ ఉన్న వర్గం మరొకటి. రెండు వర్గాలు నన్ను ఒకే విధంగా సన్మానించాయి. నాకు ఇక్కడకూడా అవమానమే ఎదురయింది. కాని, ఇప్పటి నా అనుభూతి వేరు. అవమానానికి పారిపోదా మనిపించలేదు. నేను జన్మలో ఆడలేని, ఊహించలేని అంతటి పెద్ద ఆటను సర్కస్ చూస్తున్న చిన్నపిల్లవాడిలా చూస్తూ, అనుభూతి చెందుతూ, ప్రేక్షకుడుగా ఉండిపోయా నంతే.

కట్ ఫర్ సీట్స్. ఆట ప్రారంభమయింది.

వాతావరణం గంభీరంగా మారింది. మాటలు లేవు. ఛలోక్తులు లేవు. ఎనిమిది మంది బిగుసుకు కూచున్నారు. ఎనిమిది జతల చేతులు యాంత్రికంగా కదులుతున్నాయి. బరువైన ఊపిరి, గెలిచిన వాడి మొహంలోని ఆనందం, ఓడిన వాడి నిస్పృహ, ముక్క తియ్యడం, ముక్క వెయ్యడం, డబ్బుల గల గల, నోట్ల రెప రెప తప్ప ఆ గదిలో మరొక ధ్వని లేదు.

మూడు గంటల ఆటలో లాయరు ఒక్క ఆటనుకూడా నెగ్గలేకపోయాడు. ఏడు వందల పైచిలుకు పోగొట్టుకున్నాడు.

తొమ్మిదిన్నరయింది.

లాస్ట్ డీల్.

లాయరుది చేతివరస.

ఒక్కొక్క ముక్కను పీకిపీకి లాగాడు. పదమూడు బొమ్మలు. అందులో అయిదు జోకర్లు. జోకరు రాణి.

నేను లాయరు చేతివెనక ప్రేక్షకుణ్ణి.

"ఏం జోకరు కోశావయ్యా, షుహేను భావా!" లాయరు సాణిగాడు.

చేతికి లైఫ్ లేదు. పై ముక్కను తీశాడు. ముద్దు పెట్టుకున్నాడు. ముక్కను చూడలేదు. దానితో చేతికి లైఫ్ వచ్చిందా డీల్, అంటే — ఆ ముక్క సరిఅయినదయితే మూడు వందల ఏభై రూపాయిలు తెస్తుంది. అందుకే ఆ అభిమానం, ముద్దులు. పదివేలు కట్నం తెచ్చిన భార్యనయినా శోభనం నాటి రాత్రి అంత ఆప్యాయంగా ముద్దు పెట్టుకొని ఉండడు.

నేను సస్పెన్సును భరించలేకుండా ఉన్నాను. ఆ ఆసామీ ముక్కను చూడడం.

చివరకు చూశాడు— రెండు. విసిరి కొట్టాడు.

ఎనిమిది చేతులూ ఆడాయి. జీవన్మరణ సమస్య. చావుబ్రతుకుల మధ్య కొట్టుకుంటున్న చేతులు.

లాయరు పై చెయ్యి ఎవరో కంట్రాక్టరు. ఆయన త్వరగా ఆడడు. ముక్క తీస్తాడు. ఆలోచిస్తాడు. తిరిగి లోపల పెడతాడు. లాయరుకు చిరాకు.

"వెయ్యవయ్యా, బాబూ, ఒక ముక్క. గొప్ప కంట్రోలాడుతున్నారు."

'ఒక్క కబళం, అమ్మా!' అని ప్రాధేయపడే ముష్టివాడూ 'ఒక్క ఓటు, బాబూ' అని గోలపెట్టే పొలిటీషియనూ నా కళ్ళముందు మెదిలారు.

ఆట పూర్తయింది. కాని, లాయరు చెయ్యి బ్రతకలేదు. ఫుల్‌కౌంటు నలభై రూపాయిలు. కోపంగా ముక్కలను విసిరి కొట్టాడు. పర్సులో మిగిలిన పది రూపాయిలను సమర్పించి, మిగిలిన ముప్ఫై బాకీపెట్టి బయటకు నడిచాడు— నెల సంపాదనను మూడు గంటలలో గేమ్ ఆఫ్ స్కిల్‌పై తగలెట్టిన కుర్రలాయరు.

ఆ రోజు లాభనష్టాలను, నెల నికరపు లాభనష్టాలను మనస్సులోనే బాలెన్సు షీటు వేసుకొంటూ మిగిలిన ఏడుగురు కదిలారు.

"గాంబ్లర్స్!" అన్నాను కసిగా బావతో దారిలో.

బావ నవ్వారు. ఆ నవ్వులో —'నువ్వు కూడా ఇంతేగా' అనే హేళన ధ్వనించింది.

"కాదు, పెద్దమనుషులు. వారంతా పురప్రముఖులు. రోజూ ఇదేవిధంగా ఆడుతుంటారు. కాని, తాము చేసే పనిని సమర్థించుకోవడానికి వాళ్ళు చెప్పిన కారణాలు విన్నావుగదా? జూదాన్ని ఘన కార్యంగా చెప్పుకోవడానికి వాళ్ళు చెప్పే కారణాలు సవాలక్ష. ఒక అందమైన ముసుగు తగిలించి మురుసుకుంటారు. లోకానికి అక్కరలేని సంజాయిషీలు చెప్పి తమ్ము తామే దగా చేసుకొంటున్నారు.

ఈ పెద్దమనుషు లందరు ఒకప్పుడు రోజూ పనిగట్టుకొని నాతో, మన డ్రైవరు హుసేను లేడూ, వాడిపై ఫిర్యాదులు చేసేవారు. ఈవేళ ఆడిన వారిలో ఒకతను పోలీసు సబిన్‌స్పెక్టరు. ముఖ్యంగా అతనికి హుసేనుపై రిపోర్టు లివ్వడం తప్ప వేరే పని లేదేమో ననిపించేది నాకు."

ఆసక్తితో వింటున్నాను.


"హుసేన్ చాలా మంచి మనిషి. కాని, అతనిలోకూడా ఇదే బలహీనత ఉంది. నెల మొదటి ఆదివారంలో వచ్చిన జీతంతో విశాఖ పోయి కోతముక్క ఆడేవాడు. ఎన్నోసార్లు నెలజీతం తగలెట్టుకొని వచ్చాడు. ఊళ్ళో గోల. ఇంట్లో భార్య, ముగ్గురు పిల్లల గోల. ఆ రోజులలోనే ఊరంతా అతనిపై 'గాంబ్లర్' అని ముద్రను వేసింది. కాని, ఇప్పుడు అభిప్రాయం మార్చుకొంది." బావ ఆపారు.

"మానివేశాడా?"

"లేదు. ఇతోధికంగా ఆడుతున్నాడు. గతంలో ఒకే ఒక్క ఆదివారంనాడే ఆడేవాడు. ఇప్పుడు సాధారణంగా ప్రతి సెలవురోజున ఆడతాడు. ఈ రోజు నిన్ను దింపిన తరవాత విశాఖ పోయి ఉంటాడు."

"మరి?"

"లోకం హుసేనును గాంబ్లరనకపోవడానికి కారణం, అతడు గాంబ్లింగ్ మానివేయడం మట్టుకు కాదు. గడిచిన రెండేళ్లలోను అతని అదృష్టరేఖ తిరిగి, ఆ కోత ముక్కలోనే వేలకు వేలు ఆర్జించాడు. ఇప్పుడు హుసేను ఒక లారీకి, టాక్సీకి యజమాని. సంఘంలో గౌరవనీయుడు. అతని భార్య గోలపెట్టడం ఆపింది. ఎస్. ఐ. రిపోర్టు లివ్వడం మానివేశాడు. కారణం —హుసేను ప్రయోజకు డయినాడుగా!"



ఆశ్చర్యపడ్డానా? లేదు. హేతువాదాని కందని దేదీ జరగలేదు. కళ్లముందు మసక మసక తెరలు తొలగిపోయా యంతే. రోజులో సంఘటనలన్నీ నిర్దిష్టమైన పద్ధతిలో ఒకదాని కొకటి అతుక్కున్నట్లు సమన్వయించుకో గలిగాను.

అతడు గతంలో ఉత్త డ్రైవరు, ఉత్త హుసేను. గాంబ్లర్.

వర్తమానంలో డ్రైవరుగారు, హుసేన్‌గారు.

అతని జూదగొండితనమనే వ్యసనాన్ని సంఘం క్షమించగలిగింది.

స్టేషనులో సాదరంగా అతనిని పలకరించిన అనేక గొంతులు, మర్యాదగా పిలిచి కాఫీ ఇచ్చిన అక్కయ్య, రిపోర్టు లివ్వని ఎస్. ఐ., అతని వ్యసనానికి బాధపడని హుసేను భార్య, ప్రయోజకుడుగా గుర్తించిన ఊరు— అందరూ వ్యవహరించిన తీరులో విచిత్రం లేదు.

వీరంతా హుసేను గురించి తమ తమ అభిప్రాయాలను సులభంగా మార్చుకోగలిగారు. కాని, డ్రయివరులో మార్పు ఏమాత్రం?

ఖాకీ దుస్తులు మారలేదు. చిరుగులు మాత్రం లేవు.

హవాయి చెప్పులు. పాతవాటికి బదులు కొత్తవి.

బీడీ మామూలే.

గాంబ్లింగ్ ఇతోధికం.

మారినది అతని పరిస్థితి, దానితో సంఘం అభిప్రాయం.

స్టేషనులో దృశ్యం. నా చేతిలోని సూట్ కేసును తీసుకొన్నాడు. "నమస్కారం, సార్." అత డిచ్చిన గౌరవానికి నేను ముట్టచెప్పిన దేమిటి?

"నమస్కారం. బాగున్నావా?" నా ప్రశ్న నన్ను నిలువునా దహించివేస్తోంది. సిగ్గు, అవమానం, బాధ.

నేను పడిన సిగ్గంతా అతనిని గౌరవించ నందుకు కాదు. అతనిని గౌరవించ వలసినదని ఈ క్షణంలోనే తోచినందుకు.

నా స్థితిగతులను తెలిసి ఉండీకూడా నన్ను గౌరవించగలిగిన హుసేను, అతని ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నాకే అతనిని గౌరవించవలసినదని తోచిన నేను!

నాపై నాకే అసహ్యం వేసింది.

మరొక ఆలోచన నా మస్తిష్కాన్ని దొలిచేస్తోంది. అక్కయ్య నన్ను ఈ రోజు ఉదాసీనంగా చూసింది. కారణం?

'నా తమ్ముడే. ఎమ్. ఎ. చదివాడు. పెద్ద ఆఫీసరవుతాడు. వందలకు వందలు జీతం వస్తుంది' అని ఒకనాడు సగర్వంగా చెప్పుకున్న అక్కయ్య, నా గుమాస్తా ఉద్యోగంతో రాజీ పడలేకపోయిందా? పాతిక రూపాయిల చీరను నలభై రూపాయల చీరగా మారిస్తేనే కాని ఆమెకు సంతృప్తి కలగలేదా?

'ఏదో గుమాస్తా.'

'ఏదో ఇస్తారు.'

కటువైన మాటలు. కటువైన ఆలోచనలు. కాని, ఇది మాత్రం చేదు నిజం. ప్రయోజకుడయిన హుసేను ముందు, ప్రయోజకుడు కాలేని నేను అక్కయ్య దృష్టిలో దిగదుడుపే.

ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరయిన నన్ను బావ మళ్లీ ఈ లోకంలోనికి తీసుకొని వచ్చారు.

"ఎండ్స్. నాట్ ది మీన్స్. ఏమంటావ్?"

ఏమనాలో నాకు తెలుస్తేగా!

* * *

మరునాడు ఉదయం ఏడున్నరయింది. అక్కయ్య పనిమనిషిమీద మండిపడుతూంది.

"ఏమే, బారెడు పొద్దెక్కింది. ఎనిమిది గంటలకా పనిలోనికి రావడం?"

సుబ్బి ఏవో కారణాలు చెపుతూంది. అక్కయ్య వినిపించుకొనే ధోరణిలో లేదు. బాబిగాడు స్కూలుకు టైమయిందని వేధిస్తున్నాడు.

"ఉండరా, వెధవా, నువ్వొకడివి తినేస్తున్నావు. ఇంకా ఏడున్నర కాలేదు. అప్పుడే నీ గోలొకటి. మహా నువ్వు చదివే చదువుకు, స్కూలుకు కాస్త లేటయినా ఫరవాలేదు." అక్కయ్య ఛీత్కారానికి నేను నవ్వుకున్నాను. వాడి స్కూలుకు లేటయినా ఫరవాలేదు కాని, పనిమనిషి నుండి లేటుకు సంజాయిషీ మాత్రం రాబట్టుకోవాలి.

ఆ ఊరిలో మరొక రోజును గడపగల మానసిక ధైర్యం నాకు లేదు. ఉదయం పదకొండు గంటల బండికే ప్రయాణం కట్టాను.


జీపు సిద్ధంగా ఉంది. సూట్‌కేసును అందుకోబోయాడు డ్రైవరు. నే నివ్వలేకపోయాను.

"మళ్లా ఎప్పుడు వస్తారు, సార్?" మామూలుగానే అడిగాడు. కాని, ఆ 'సా'రన్న పదం నన్ను చిత్రవధ చేసింది. నా కదొక మర్మఘాతం.

"ఎప్పుడో చెప్పలేను."

ఒక్కసారి, ఒకే ఒక్కసారి అతనిని 'హుసేనుగారూ!' అని పిలవాలనిపించింది. కాని, సభ్య సమాజపు సంప్రదాయాలూ, నేను కట్టుకున్న టెరిలీను దుస్తులూ ఆ కోరికను నా మనస్సులోనే బలవంతంగా అణగదొక్కాయి.

స్టేషను దాటింది. ఊరు కనుమరుగయింది. భారమయిన మనస్సుతో నిట్టూర్చాను. మరిచిపోలేని వ్యక్తులు, సంఘటనలు.




పాంగు — యస్. జె. నరసింహారెడ్డి (సికిందరాబాద్ – 3)

బ్రతుకు ముక్కకు ప్రాధేయపడ లాయరు, లా ఆఫ్ ఆవరేజస్ చెప్పుకు పోయిన హెడ్మాష్టరు, గాంబ్లర్ హుసేన్? ఆఫీసరు కాలేని నేను, నేను కొన్న పాతిక రూపాయిల సాదాచీర, డ్రైవరుగారికి కాఫీ, ఏదో గుమాస్తాగాడి ఏదో జీతం లేటుగా రాకూడదని సుబ్బి, లేటుగా స్కూలుకు వెళ్ళినా ఫరవాలేని బాబిగాడు, వీరందరి మధ్య మానవనైజాన్ని కూలంకషంగా ఆకళింపు చేసుకొన్న బావ.

తల పగిలిపోతూంది. కణతలు నొక్కుకున్నాను.

ఎన్నడో చదివిన సాపేక్ష సిద్ధాంతం జ్ఞాపకం వచ్చింది. అంతా రెలిటివ్ అన్నాడు ఐన్‌స్టైన్. ★